సాక్షి
మెదక్
బుధవారం, 13, డిసెంబర్, 2023



'అమ్మవారికే శఠగోపం

దేవుడి పైసా దళారుల పాలు'అన్నట్లు ఏడుపాయల దుర్గమ్మ ఆదాయాన్ని కొంత మంది టెండర్‌దారులు అందిన కాడికి దోచుకుంటున్నారు.


వివరాలు 8లో ▸



ప్రసవాల సంఖ్యను పెంచండి

ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవాల సంఖ్యను పెంచాలని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వైద్యులకు సూచించారు.

వివరాలు 8లో ▸



కోరుకున్న చోటే కొలువు

ఏళ్ల తరబడి సీడీపీఓ కార్యాలయ సిబ్బంది, అధికారులు అక్రమ డిప్యుటేషన్లపైనే విధులు నిర్వహిస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

ఈకేవైసీపై ఆందోళన వద్దు

అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు



మెదక్ కలెక్టరేట్: గ్యాస్ వినియోగదారులకు ఈకేవైసీకి ఎలాంటి కాలపరిమితి లేదని, ఇదొక సర్వసాధారణ ప్రక్రియ అని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు మంగళవారం తెలిపారు. ప్రభుత్వం ఏ కార్యక్రమమైనా ఆధార్ లింక్ ఉంటే సరిపోతుందని తెలిపారు. జిల్లాలో గ్యాస్ వినియోగదారులకు 98 శాతం వరకు అనుసంధానమై ఉందని తెలిపారు. ఈ విషయంలో పుకార్లు నమ్మి ఆందోళనకు గురికావద్దని తెలిపారు.

ఇనాం భూముల రిజిస్ట్రేషన్



మాట్లాడుతున్న శివకుమార్‌గౌడ్

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధి సికింద్లాపూర్‌లోని పలువురు రైతులకు ఇనాం భూములను రిజిస్ట్రేషన్ చేయిస్తున్నట్లు ప్రసాద్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్, హైకోర్టు న్యాయవాది శివకుమార్‌గౌడ్ అన్నారు. మంగళవారం గూడూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సర్వే నంబరు 47, 48, 49, 59, 65, 66, 81లో 27 మంది రైతులు 50 ఎకరాల్లో ఇనామ్ భూములు సాగు చేసుకుంటున్నారని చెప్పారు. 1954–55, 1973–74 పహాణీల్లో ఇనాందారుల వంశస్తుల పేరిట ఉన్నాయని తెలిపారు. వారి పేరిటే ఓఆర్‌సీ, కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలు వచ్చాయన్నారు. ఈ వంశస్తులకు ట్రస్టు తరఫున డబ్బులు చెల్లించి రైతుల పేరిట రిజిస్ట్రేషన్ చేయిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో విశ్వశ్రీ లా చాంబర్ సభ్యులు లిఖిత, శ్రీనివాస్, రాజేందర్‌రెడ్డి, అంబిక, చెన్నారెడ్డి తదితరులు ఉన్నారు.

దుర్గమ్మ సేవలో ఎమ్మెల్సీ రాజు



ప్రసాదం అందుకుంటున్న రాజు

పాపన్నపేట(మెదక్): ఏడుపాయల దుర్గమ్మను ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు మంగళవారం దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. పూజారి శంకరశర్మ అర్చన గావించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఏడుపాయల పాలకవర్గ చైర్మన్ బాలాగౌడ్ ఆయనను ఆలయ మర్యాదల ప్రకారం ఘనస్వాగతం పలికారు. అనంతరం శాలువాతో సత్కరించారు.

విదేశీ విద్యకు అవకాశాలెన్నో



మాట్లాడుతున్న నాగరాజు

నర్సాపూర్: విదేశాల్లో ఉన్నత విద్య చదివేందుకు ఉన్న అవకాశాల గురించి న్యూయార్క్‌లోని బింగ్ హమ్‌టన్ యూనివర్సిటీ డీన్ అండ్ ప్రొఫెసర్ కిన్నెబోయిన నాగరాజు వివరించారు. ఇక్కడ విద్య అభ్యసించేందుకు తమ వంతు సహకారం అందిస్తామని చెప్పారు. మంగళవారం ఆయన నర్సాపూర్‌లోని బీవీ రాజు ఇంజినీరింగ్, విష్ణు ఫార్మసీ కాలేజీలను సందర్శించారు. ఈ సందర్భంగా ఇంజినీరింగ్ కాలేజీలో ఏర్పాటు చేసిన ఏటీఎల్ ల్యాబొరేటరీని పరిశీలించారు. ల్యాబ్‌లో 3డీ ప్రింటింగ్, దివ్యాంగుల కోసం తయారు చేసిన పలు పరికరాలను పరిశీలించి అభినందించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో విష్ణు ఎడ్యుకేషన్ సొసైటీ వైస్ చైర్మన్ రవిచంద్రన్ రాజగోపాల్, ఫార్మసీ కాలేజీ ప్రిన్సిపాల్ రమేశ్, పలు విభాగాలకు చెందిన హెచ్‌ఓడీలు, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు ఉద్యోగులు సస్పెన్షన్

రూ.5.85 కోట్ల నిధుల దుర్వినియోగం

మెదక్ కలెక్టరేట్: మెదక్ జిల్లా మెదక్ మండలం పౌర సరఫరాల శాఖలో పనిచేస్తున్న ఇద్దరు ఉద్యోగులపై సస్పెన్షన్ వేటు పడింది. మండల్ లెవల్ స్టాక్ పాయింట్(ఎంఎల్ఎస్)లో బియ్యం సరఫరాలో అక్రమాలు జరిగాయని అదనపు కలెక్టర్లు వెంకటేశ్వర్లు తెలిపారు. ఇందులో రూ.5,85,67,860 నిధుల దుర్వినియోగం జరిగిందని గుర్తించారు. ఇందుకు బాధ్యులైన సీనియర్ అసిస్టెంట్ నర్సింహులు, డేటా ఎంట్రీ ఆపరేటర్ చిన్నగల్ల శ్రీనివాస్‌ను సస్పెండ్ చేశామని పేర్కొన్నారు. వారిపై క్రిమినల్ కేసు నమోదు చేశామని వెల్లడించారు.



రైతుబంధు రూ.200 కోట్లు

- జిల్లాలో 2,80,949 మంది రైతులకు చేకూరనున్న లబ్ధి
- పాతపద్ధతిలోనే నిధులు విడుదల

మెదక్: ఈ యాసంగిలో రైతుబంధు పంపిణీకి అధికారులు సర్వం సిద్ధం చేశారు. పాత పద్ధతిలోనే నిధులు విడుదల అవుతున్నాయి. కాని కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రైతుబంధు ఏడాదికి ఒక ఎకరాను గాను రూ.15 వేల చొప్పున కౌలురైతుకు సైతం వర్తింపజేయాల్సి ఉంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎకరాకు రూ.5 వేల చొప్పున ఏడాదికి రూ.10 వేలు ఇచ్చింది. ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఇంకా విధివిధాలను ప్రకటించకపోవడంతో గత ప్రభుత్వం మాదిరిగానే అంతే మొత్తాన్ని పెట్టుబడి సాయంగా అందజేస్తుంది. ఇచ్చిన హామీ మేరకు వచ్చే వానాకాల సీజన్ నుంచి ఎకరాకు రూ.7,500 ఏడాదికి రూ.15 వేలు అమలు చేయబోతున్నట్లు తెలిసింది.

గత బీఆర్ఎస్ ప్రభుత్వం.. ధరణి పోర్టల్ తీసుకొచ్చి సమస్యలున్న వేలాది భూములను పార్ట్(బీ)లో పెట్టింది. ఈ భూముల సమస్యలను పరిష్కరించి సదరు రైతులకు సైతం పట్టాలు ఇచ్చి వారికి కూడా రైతుబంధు వర్తింపజేసింది. దీంతో జిల్లాలో ప్రతి ఏటా రైతుల సంఖ్య పెరిగింది. 2022 యాసంగిలో జిల్లాలో 2,39,579 మంది రైతులకు రైతుబంధు కింద రూ. 189.57 కోట్లు జమ చేసింది. ఈ ఏడు యాసంగిలో 2,80,949 మంది ఈ పథకానికి అర్హులుగా అధికారులు గుర్తించారు. ఇప్పుడు రూ. 200 కోట్ల 71 లక్షల 74 వేల పంపిణీ చేయనునట్లు ఓ జిల్లా ఉన్నతాధికారి ఒకరు చెప్పారు. గతేడాదితో పోలిస్తే రూ. 11.88 కోట్లు అధికంగా ప్రభుత్వం చెల్లించనుంది. అలాగే రైతుల సంఖ్య కూడా 41,370 మందికి పెరిగింది.

మహాలక్ష్మితో ఆర్థిక స్వావలంబన

- ఈ పథకం విద్యార్థులకు, మహిళలకు ఎంతో ఉపయోగకరం
- కలెక్టర్ రాజర్షిషా



మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షిషా

మెదక్ కలెక్టరేట్: ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణంపై మహిళల నుంచి విశేష స్పందన లభిస్తోందని కలెక్టర్ రాజర్షిషా పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో మహాలక్ష్మి పథకంపై ఆర్టీసీ డిపో మేనేజర్ సుధ, అధికారులతో కలిసి ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం ద్వారా మహిళలు ఆర్థిక స్వావలంబనతోపాటు రక్షణ కల్పించబడుతోందని తెలిపారు. విద్యార్థులకు, వారికి ఇది ఎంతో ఉపయోగకరంగా ఉందని చెప్పారు. అలాగే మెదక్, నర్సాపూర్ బస్ డిపోల్లో ఉన్న మరుగుదొడ్లను, బస్ డిపో చుట్టూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ఆరుబయట మూత్ర విసర్జన చేసే వారికి ఫైన్ వేయాలని అధికారులను ఆదేశాలిచ్చారు. కాగా పథకం ప్రారంభించిన మొదటి రోజున మెదక్ డిపోలో 9,548 మంది మహిళలు ప్రయాణించగా, రెండోరోజు 22,566 మంది, 3వ రోజు 40,698 మంది బస్సుల్లో ప్రయాణించినట్లు ఆర్టీసీ డీఎం సుధ వివరించారు. నర్సాపూర్ డిపోలో మొదటి రోజు 3,634, రెండో రోజు 9,604, 3వ రోజు 13,721 మంది ప్రయాణించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మెదక్ తహసీల్దార్ శ్రీనివాస్, మెదక్ మున్సిపల్ కమిషనర్ జానకి రామ్‌సాగర్, అధికారులు పాల్గొన్నారు.

నిపుణులతో స్టడీ మెటీరియల్

మెదక్ కలెక్టరేట్: ఇంటర్ ఫలితాల్లో జిల్లాను రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిపేలా కృషి చేయాలని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లాలోని జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లతో కలిసి ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిపుణులతో సబ్జెక్టుల వారీగా స్టడీ మెటీరియల్ తయారు చేయించి విద్యార్థులకు అందజేయాలని సూచించారు. వారి సామర్థ్యాన్ని బట్టి గ్రూపులుగా విభజించి బోధన చేయాలని ఆదేశించారు. వారి తల్లిదండ్రులతో కళాశాలల్లో సమావేశాలు ఏర్పాటు చేసి డ్రాపౌట్స్‌ను తగ్గించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఇంటర్ విద్యాధికారి సత్యనారాయణ, ప్రిన్సిపాల్స్ శిధర్, శ్రీనివాస్ గౌడ్, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.



హాజరైన మండలాల ఏఓలు

నకిలీ విత్తనాలపై ఉక్కుపాదం

జిల్లా వ్యవసాయ అధికారి గోవిందు



మాట్లాడుతున్న గోవిందు

కొల్చారం(నర్సాపూర్): నకిలీ విత్తనాలు ఎట్టి పరిస్థితుల్లో బహిరంగ మార్కెట్లో ప్రవేశించకూడదని జిల్లా వ్యవసాయ అధికారి గోవిందు స్పష్టం చేశారు. వాటి గురించి సమాచారం అందిన వెంటనే అధికారులు స్పందించి సదరు వ్యక్తులపై శాఖా పరమైన చర్యలను తీసుకోవాలని ఆదేశించారు. మంగళవారం మండల పరిధిలోని పోతంశెట్టిపల్లి గ్రామ శివారులో ఉన్న రైతు వేదికలో వ్యవసాయ రంగ ముఖ్య అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఇందులో జిల్లాలోని నాలుగు డివిజన్ల మండలాల వ్యవసాయ అధికారులు(ఏఓలు), సహాయ వ్యవసాయ అధికారులు, విస్తరణాధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా గోవిందు మాట్లాడారు. త్వరలో ప్రారంభమయ్యే యాసంగి పంటల నమోదు, రైతులకు అందిస్తున్న రైతు బంధు, రైతు భరోసా, పీఎం కిసాన్ పథకాలపై పూర్తి స్థాయిలో అధికారులకు అవగాహన కల్పించారు. ఇంకా అక్కడక్కడ ధాన్యం కొనుగోలు ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. దానిని వెంటనే పూర్తి చేయాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. రైతులకు అందుబాటులో ఉంటూ అవసరమైన సూచనలు సలహాలు అందించవలసిన బాధ్యత ప్రతి వ్యవసాయ అధికారిపై ఉందని గుర్తుచేశారు. నాణ్యమైన విత్తనాలను అందేలా చూడవలసిన బాధ్యత వ్యవసాయ శాఖపై ఉందన్నారు.

రోగులకు మెరుగైన వైద్యం

డీఎంహెచ్‌ఓ చందూనాయక్



పీహెచ్‌సీలో చందూనాయక్

కొడిపల్లి(నర్సాపూర్): రోగులకు మెరుగైన వైద్యం అందించాలని డీఎంహెచ్‌ఓ చందూనాయక్ వైద్యసిబ్బందిని ఆదేశించారు. మంగళవారం కొడిపల్లి పీహెచ్‌సీలో ఆకస్మిక తనిఖీ చేశారు. ఇక్కడ రోగులకు అందుతున్న వైద్యసేవల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. నూతనంగా నిర్మిస్తున్న సీహెచ్‌సీ భవన నిర్మాణ పనులనూ పరిశీలించారు. నిర్మాణం త్వరగా పూర్తి అయ్యేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే రోగులకు నాణ్యమైన వైద్యసేవలు అందించేందుకు సిబ్బంది శాయశక్తులా కృషి చేస్తున్నారని చెప్పారు. ఆరోగ్య మహిళ పేరిట అందుతున్న వైద్యసేవలపై సంతృప్తిని వ్యక్తం చేశారు. కొందరికి ఎమర్జెన్సీ సేవలు అవసరమైనప్పుడు మెదక్ ఆస్పత్రికి రిఫర్ చేస్తున్నట్లు తెలిపారు. సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి ప్రవీణ్, డాక్టర్ ఫెర్నాజ్, సీహెచ్ఓ ఎలిజబెత్, సూపర్‌వైజర్ రమేశ్ పాల్గొన్నారు.

బుజ్రన్‌పల్లిలో చిరుత సంచారం

పెద్దశంకరంపేట(మెదక్): మండల పరిధిలోని బుజ్రన్‌పల్లి గ్రామశివారులో చిరుత పులి సంచరిస్తోందని ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ వికాస్ తెలిపారు. సోమవారం రాత్రి గ్రామస్తులతో నిర్వహించిన సమావేశంలో పలు సూచనలు అందించారు. పంట పొలాలకు వెళ్లే రైతులు రాత్రి వేళ జాగ్రత్తగా ఉండాలని గుంపులుగా వెళ్లాలని చెప్పారు. పొలాల వద్ద పశువులను కట్టి వేయవద్దని తెలిపారు. చిరుత కనిపిస్తే తమకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో బీట్ ఆఫీసర్ శ్రీనివాస్, సర్పంచ్ బూదేమ్మ విఠల్ తదితరులు ఉన్నారు.

ముసుగులోనే విగ్రహాలు



ముసుగును తొలగించని వైఎస్సార్ విగ్రహం

కౌడిపల్లి(నర్సాపూర్): ఎన్నికల కోడ్ ముగిసిన ప్పటికీ.. మండల కేంద్రంలో ఉన్న దివంగత వైఎస్సార్, సీపీఐ నాయకులు చిలుముల విఠల్‌రెడ్డి విగ్రహాలు ఉన్నాయి. వాటికి ముసుగు తీయలేదు. ఎన్నికల తంతు పూర్తయి వారం రోజులైనా తొలగించలేదని గ్రామస్తులు, నేతల అభిమనులు పేర్కొన్నారు. ఇప్పటికైనా తొలగించాలని వారు కోరుతున్నారు.

అనుమతి లేకుండా ఫ్యాక్టరీ నిర్మాణమా?

వివరణ ఇవ్వాలని మెదక్ డీపీఓ, శివంపేట పీఎస్‌కు హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: అనుమతి లేకుండా ఫ్యాక్టరీ నిర్మాణం, అనధికారికంగా మంజీరా నీటి వినియోగంపై తమ ఎదుట హాజరై వివరణ ఇవ్వాలని మెదక్ జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ), శివ్వంపేట్ పంచాయతీ సెక్రటరీ(పీఎస్)ని హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను ఈనెల 28కి వాయిదా వేసింది. శివంపేట్‌లోని సర్వే నంబర్ 201, 209, 220, 221, 222, 226, 227, 228లో స్మోల్ బ్రూవరీస్ లిమిటెడ్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేసి అనధికారికంగా మంజీరా నీటిని వినియోగించుకుంటోందని, అనుమతి లేకుండా నిర్మాణాలు చేపట్టిన సంస్థపై చర్యలు తీసుకునేలా ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ మెదక్ జిల్లా పుల్కల్ మండలం శివంపేట్‌కు చెందిన కె.మల్లికార్జున గౌడ్, మరికొందరు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పంచాయతీరాజ్ చట్టాన్ని ఉల్లంఘించి సంస్థ వ్యవహరిస్తున్నా.. అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ జూకంటి ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది. వాదనలు విన్న ధర్మాసనం డీపీవో, పీఎస్‌లకు నోటీసులు జారీ చేసింది.

పదిలో సత్ఫలితాలు సాధించాలి

జిల్లా విద్యాధికారి రాధాకిషన్



మాట్లాడుతున్న రాధాకిషన్

పెద్దశంకరంపేట(మెదక్): పదోతరగతి విద్యార్థులు మంచి ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా విద్యాధికారి రాధాకిషన్ అన్నారు. ప్రభుత్వ పాఠశాల్లో విద్యా ప్రమాణాల పెంపునకు చర్యలు తీసుకుంటున్నట్లు అన్నారు. మంగళవారం పెద్దశంకరంపేటలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో గణిత శాస్త్ర ఉపాధ్యాయులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. విద్యార్థులకు సులభమైన పద్ధతుల్లో నాణ్యమైన విద్య అందించాలన్నారు. నెలవారీగా నిర్వహించే పరీక్షల్లో వారు సాధించిన మార్కులను అధికారులు సూచించిన యాప్‌లో టీచర్లు అప్‌లోడ్ చేయాలని పేర్కొన్నారు. అనంతరం కస్తూర్బా విద్యాలయాన్ని సైతం ఆయన తనిఖీ చేశారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు వెంకటేశం, కేజీబీవీ ప్రిన్సిపాల్ నాగరాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

అల్లాదుర్గం(మెదక్): పదో తరగతి విద్యార్థులకు మెరుగైన విద్య అందించేందుకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని జిల్లా విద్యాధికారి రాధాకిషన్ చెప్పారు. ఉపాధ్యాయులు మారుతున్న సాంకేతిక మార్పులకు అనుగుణంగా, టెక్నాలజీ వినియోగించుకుని విద్యబోధన చేయాలని పేర్కొన్నారు. మంగళవారం అల్లాదుర్గం జెడ్పీ పాఠశాలలో రేగోడ్, శంకరంపేట, అల్లాదుర్గం సైన్స్ ఉపాధ్యాయులకు కాంప్లెక్స్ శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫిజికల్, రసాయన, బయో సైన్స్ విద్యను ప్రయోగాలతో బోధిస్తే విద్యార్థులకు సులువుగా అర్థం అవుతుందన్నారు. ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ విద్యార్థులతో ఉదయం, సాయంత్రం చదివిస్తే ఎలాంటి ఉపయోగం ఉండదని అభిప్రాయం వ్యక్తం చేశారు. వారికి అర్థమయ్యేలా డౌట్లకు సరైన సమాధానాలు ఇవ్వాలని వివరించారు. వారు సందేహాలు అడగకుంటే తామే ప్రశ్నలు వేసి సరైన సమాధానాలు రాబట్టినప్పుడే మెరుగైన విద్య అందుతుందని వెల్లడించారు. ప్రతి పాఠశాలలో ఉపాధ్యాయులు ప్రణాళికాబద్ధంగా బోధన చేస్తే మంచి ఫలితాలు సాధించగలమనే ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏఎంఓ సుదర్శన్, సీఎంఓ సతీశ్, ఆయా పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

85 శాతం ధాన్యం కొనుగోళ్లు

పీఏసీఎస్ సీఈఓ పోచయ్య

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల పరిధిలోని రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజను కొంటామని పీఏసీఎస్ సీఈఓ పోచయ్య అన్నారు. మంగళవారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోమక్కపేట్ ఉన్న ఏకైక పీఏసీఎస్‌లో మండలవ్యాప్తంగా 1.6 లక్షల క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేశామన్నారు. మండలంలో దాదాపుగా 85 శాతం కొనుగోళ్లు పూర్తయ్యాయని తెలిపారు. నిత్యం ధాన్యం కొనుగోలు జరుగుతోందని, త్వరలోనే మిగతా 15 శాతం కొనుగోళ్లు పూర్తి చేస్తామన్నారు.

పోస్టల్ ఉద్యోగుల నిరవధిక సమ్మె



నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

మెదక్ కలెక్టరేట్: జీడీఎస్ (గ్రామీణ డాక్ సేవకులు) ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సంఘం డివిజన్ కార్యదర్శి సిద్దిరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం ఆలిండియా సంఘం పిలుపు మేరకు మెదక్‌లోని డివిజన్ కార్యాలయం ఎదుట నిరవధిక సమ్మె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 8 గంటల పని, పెన్షన్‌తో సహా అన్ని ప్రయోజనాలను కల్పించాలని చేయాలని డిమాండ్ చేశారు. కమలేశ్ చంద్ర కమిటీ సానుకూల సిఫారసులు అన్నింటినీ వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. రెగ్యులర్ ఎంప్లాయీస్‌కు ఇచ్చినట్లు వేయిటేజీ, ఇంక్రిమెంట్స్ ఇవ్వాలని కోరారు. గ్రూప్ ఇన్సూరెన్స్ కవరేజీ రూ.5లక్షల వరకు పెంచాలని అన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. నిరసనలో డివిజన్ నాయకులు పాల్గొన్నారు.

రూ.12 వేల గౌరవ వేతనమివ్వాలి

- ఆటో డ్రైవర్ల డిమాండ్
- తూప్రాన్- నర్సాపూర్ ప్రధాన రహదారిపై రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న ఆటో డ్రైవర్లు

శివ్వంపేట(నర్సాపూర్): ప్రభుత్వం తమకు రూ.12 వేల గౌరవ వేతనం ఇవ్వాలని, రూ.10 లక్షల బీమా సౌకర్యం కల్పించాలని ఆటోడ్రైవర్లు డిమాండ్ చేశారు. ఆర్టీసీ బస్సుల ద్వారా మహిళలకు ఉచిత ప్రయాణం అమలవుతుండటం వల్ల తమ జీవనోపాధిని కోల్పోయామని నిరసిస్తూ మంగళవారం రాస్తారోకో చేశారు. తూప్రాన్–నర్సాపూర్ ప్రధాన రహదారి అయిన శివ్వంపేట బస్టాండ్ వద్ద బైఠాయించారు. అనంతరం ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలిచ్చారు. ఈ సందర్భంగా ఆటో డ్రైవర్ల యూనియన్ నాయకులు మాట్లాడుతూ మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం వల్ల ఆటోల్లో ఎవరూ ఎక్కడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వీరికి సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి సంఘీభావం తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న ఎస్‌ఐ రవికాంత్ ఘటనా స్థలానికి చేరుకొని ఆందోళనకారులకు నచ్చజెప్పి రాస్తారోకోను విరమింపజేశారు. అక్కడ నుంచి ఆటోడ్రైవర్లు ర్యాలీగా తరలివెళ్లి తహసీల్దార్ శ్రీనివాస్‌చారికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఆంజనేయులుగౌడ్, అనీల్, రమేశ్ గౌడ్, ప్రభాకర్ నాయక్, చాన్‌పాషా, ఇబ్రహీం, ప్రశాంత్, ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

ఉమ్మడి జిల్లా ఎస్జీఎఫ్‌ క్రికెట్‌ జట్టు ఎంపిక



ఎంపికైన క్రికెట్‌ జట్టు

సిద్దిపేటకమాన్‌: ఉమ్మడి మెదక్‌ జిల్లా ఎస్జీఎఫ్‌ అండర్‌ 19 క్రికెట్‌ జట్టును మంగళవారం సిద్దిపేట స్టేడియంలో ఎంపిక చేశారు. డిసెంబర్‌ 14 నుంచి 17 వరకు గద్వాల్‌లో జరుగనున్న రాష్ట్ర స్థాయి బాలుర క్రికెట్‌ టోర్నీలో పాల్గొనున్నారు. ఈ ఎంపికలో సిద్దిపేట, మెదక్‌, సంగారెడ్డి జిల్లాల్లోని 30 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడ శాఖ అధికారి నాగేందర్‌, జిల్లా ఇంటర్‌ విద్యాధికారి సూర్యప్రకాశ్‌, సిద్దిపేట క్రికెట్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు మల్లికార్జున్‌, డాక్టర్‌ మహేశ్‌ తదితరులు పాల్గొన్నారు.

భూ వివాదంలో ఘర్షణ

పలువురికి తీవ్ర గాయాలు



ఆస్పత్రిలో క్షతగాత్రుడు

కోహీర్‌(జహీరాబాద్‌): మండలంలోని మనియార్‌పల్లి గ్రామంలో మంగళవారం భూ వివాదం కారణంగా జరిగిన ఘర్షణలో పలువురికి తీవ్రంగా గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామ శివారులోని 41 సర్వే నంబర్‌ భూవివాదం గొడవకు దారితీసింది. ఇరువర్గాల వారు కత్తులు, పారలతో కొట్టుకోగా కోహీర్‌ మాజీ కో-ఆప్షన్‌ సభ్యుడు అశ్రఫ్‌ అలీ, ఆయన సోదరులు బర్కత్‌అలీ, రహమత్‌అలీ గాయపడ్డారు. వీరికి కోహీర్‌ ప్రభుత్వాస్పత్రిలో ప్రాథమిక చికిత్స నిర్వహించి డాక్టర్‌ సూచన మేరకు జిల్లా కేంద్రంలోని ఆస్పత్రికి తరలించారు. రహమత్‌అలీ పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. మరో వర్గానికి చెందిన మనియార్‌పల్లి వాసులు రషీద్‌, సత్తార్‌, కరీం, మహబూబ్‌బీ గాయపడ్డారు.కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు కోహీర్‌ పోలీసులు తెలిపారు.

తండ్రి మందలించాడని..

కుమారుడి ఆత్మహత్య



గణేశ్‌ మృతదేహం

చేగుంట(తూప్రాన్‌): తండ్రి మందలించాడని కుమారుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మాసాయిపేట మండల కేంద్రం శివారులో ఆలస్యంగా వెలుగు చూసింది. ఎస్‌ఐ హరీశ్‌ తెలిపిన వివరాల ప్రకారం.. తూప్రాన్‌ మండలం ఇస్లాంపూర్‌ గ్రామానికి చెందిన గజ్జెల భూషణం కుమారుడు గణేశ్‌(28) కొద్ది రోజులుగా మద్యానికి బానిసయ్యాడు. మద్యం తాగడం మానుకోవాలని శుక్రవారం తండ్రి భూషణం కుమారుడు గణేశ్‌ను మందలించాడు. దీంతో గణేశ్‌ అదే రోజు ఇంట్లోంచి వెళ్లిపోయాడు. ఈ క్రమంలోనే మంగళవారం సాయంత్రం మాసాయిపేట శివారులోని రామప్ప చెరువువద్ద గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడినట్లు స్థానికులు గుర్తించి పోలీసులు సమాచారం అందించారు. చేగుంట పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించారు. మృతదేహం ఎవరిది అనే దానిపై చుట్టుపక్కల గ్రామాల్లో విచారించగా ఇస్లాంపూర్‌ గ్రామానికి చెందిన గణేశ్‌గా తెలిసింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్‌ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

‘అమ్మవారి’కే శఠగోపం

- ఏడుపాయల ఆలయ ఆదాయానికి గండి
- నిబంధనలు పాటించని టెండర్‌దారులు
- లక్షల్లో పేరుకుపోయిన బకాయిలు
- ప్రతీ ఏడాది కొత్తవారి పేరుతో టెండర్‌
- పట్టించుకోని అధికారులు

పాపన్నపేట(మెదక్‌): ‘దేవుడి పైన దళారుల పాలు’ అన్నట్లు ఏడుపాయల దుర్గమ్మ ఆదాయాన్ని కొంత మంది టెండర్‌ దారులు అందిన కాడికి దోచుకుంటున్నారు. టెండర్‌ దారులు రూ.కోటి బకాయిలు పెట్టి చివరి సమయానికి చేతులెత్తేస్తున్నారు. 2017 నుంచి ఆరేళ్లలో టెండర్‌ బకాయిలు రూ. 99,82,500 చేరాయి. కాగా అంతకు ముందు ఉన్న బకాయిల రికార్డులు లేవని అధికారులు చెబుతున్నారు. అవి కూడా భారీ మొత్తంలోనే ఉన్నట్లు తెలుస్తోంది. ఇందులో ఇప్పటి వరకు ఇద్దరి మీద కేసులు నమోదు చేసి చేతులు దులుపుకున్నారు. అయినా ఫలితం లేదు. మళ్లీ కొత్త టెండర్లలో బకాయిదారులకు అవకాశమివ్వకపోవడంతో తమ స్నేహితుల పేరు మీద టెండర్లు వేస్తున్నారు. ఈ సమస్యను అధిగమించడానికి ఈసారి టెండర్‌ డబ్బులు మొత్తం మొదట్లోనే చెల్లించాలని నిబంధనలు పెట్టారు. దీంతో సోమవారం ఆరు టెండర్లు నిర్వహించగా అందులో ఐదు వాయిదా పడ్డాయి.



ఏడుపాయల పుణ్య క్షేత్రం

డబ్బు రావాల్సి ఉందంటూ..

గతంలో సైతం కొంత మంది బకాయిలు ఉన్నట్లు తెలుస్తోంది. కానీ దానికి సంబంధించిన రికార్డులు తమ దగ్గర అందుబాటులో లేవని అధికారులు చెబుతున్నారు. ఈ విషయంపై కొంతమంది టెండర్‌దారులు మాట్లాడుతూ.. తమకు ఆలయం నుంచి కొంత డబ్బు రావాల్సి ఉందని, అది చెల్లిస్తే బకాయిలు కట్టడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. కాగా దేవస్థాన సిబ్బంది వీఐపీల కోసం దాదాపు 2,900 వందల చీరలు తమ దగ్గర తీసుకున్నట్లు టెండర్‌ దారు తెలిపారు.



టెండర్లు నిర్వహిస్తున్న దృశ్యం (ఫైల్‌)

రూ.లక్షల్లో బకాయిలు

తెలంగాణలో ప్రసిద్ధి చెందిన ఏడుపాయల వన దుర్గమ్మ ఆలయానికి ఏటా రూ.8 కోట్ల ఆదాయం వస్తుంది. ఇందులో గతేడాది టెండర్ల ద్వారా రూ.2,63,93,000 వచ్చింది. అయితే కొబ్బరికాయలు, ఒడి బియ్యం, తలనీలాలు, కొబ్బరి ముక్కలు, పూజా సామగ్రి, ఎగ్జిబిషన్‌లకు ప్రతీ సంవత్సరం టెండర్లు నిర్వహిస్తారు. కొంత మంది కోటరీగా ఏర్పడి ప్రతీయేటా రూ.కోట్ల మొత్తంలో టెండర్లు పాడి, చివరకు బకాయిలు కట్టే సమయంలో చేతులెత్తేస్తున్నారు. ఈ క్రమంలోనే 2017 నుంచి ఇప్పటి వరకు వసంత్‌రెడ్డి రూ.1,55,000, మల్లేశం పేరిట 2017లో రూ.17,25,500 లక్షలు బకాయి ఉన్నప్పటికీ, 2019లోనూ ఇతడికి టెండర్‌ ఇచ్చారు. మళ్లీ ఈ సంవత్సరం రూ.6,96,000 బకాయిలు పడ్డారు. వారిపై కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. వీరితోపాటు ప్రసాద్‌ పేరిట 2017లో రూ.1,91,000 ఈఏడు 28,40,000 కలిపి మొత్తం రూ.30.31 లక్షలు బకాయిలు ఉన్నాయి. 2019లో శ్రీనివాస్‌ రూ.2 లక్షలు, ఎస్‌.సాయిలు రూ.2,50 లక్షలు, దశరత్‌ రూ.38 లక్షలు, రాంచందర్‌ రూ.5వేలు, ముజీబ్‌ రూ.50 వేలు బకాయిలు ఉన్నారు.

కేసులు నమోదు చేస్తాం

ఏడుపాయల ఆలయానికి టెండర్‌దారుల వద్ద నుంచి సుమారు.రూ.కోటి బకాయిలు రావాల్సి ఉంది. వీటి వసూళ్ల కోసం నోటీసులిస్తాం. ఆ పై కేసులు నమోదు చేస్తాం. బకాయిలు పడకుండా చూడాలన్న ఉద్దేశ్యంతో ఈసారి టెండర్‌ డబ్బులు మొత్తం వారం రోజుల్లో చెల్లించాలన్న నిబంధనలు పెట్టాం.

–మోహన్‌రెడ్డి, ఏడుపాయల ఈఓ.



ప్రభుత్వాస్పత్రిలో సేవల గురించి అడిగి తెలుసుకుంటున్న మంత్రి పొన్నం ప్రభాకర్‌

ప్రసవాల సంఖ్యను పెంచండి

- మంత్రి పొన్నం ప్రభాకర్‌
- హుస్నాబాద్‌ ప్రభుత్వాస్పత్రి సందర్శన
- పలు సమస్యలపై వినతిపత్రాలు అందజేత

హుస్నాబాద్‌: ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవాల సంఖ్యను పెంచాలని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ వైద్యులకు సూచించారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించి మొక్కలు నాటారు. ఆస్పత్రిలో వైద్య సేవలు ఎలా అందుతున్నాయో రోగులను అడిగి తెలుసుకున్నారు. రాజీవ్‌ ఆరోగ్య శ్రీ పథకం కింద రూ.10లక్షల ఖరీదైన వైద్యాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అంతక ముందు ఆస్పత్రి ఆవరణలో వాసవి సేవా సమితి ఆధ్వర్యంలో ప్రతి నెల అమావాస్య రోజున రోగుల కుటుంబ సభ్యులకు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని మంత్రి ప్రారంభించారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్‌ డాక్టర్‌ రమేశ్‌ రెడ్డి, సింగిల్‌ విండో చైర్మన్‌ బొలిశెట్టి శివయ్య తదితరులు పాల్గొన్నారు.

వినతుల వెల్లువ..

హుస్నాబాద్‌ పట్టణంలో మంత్రి పొన్నం ప్రభాకర్‌కు పలు సమస్యలపై వినతిపత్రాలు ఇచ్చారు. సీపీఎస్‌ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్‌ విధానాన్ని అమలు చేయాలని తెలంగాణ కంట్రిబ్యూటర్‌ పెన్షన్‌ స్కీం ఎంప్లాయీస్‌ అసోసియేషన్‌ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హస్నుండ్ల భాస్కర్‌ ఆధ్వర్యంలో వినతి పత్రం ఇచ్చారు. హుస్నాబాద్‌ మండలంలో పదవ తరగతి పరీక్షలు రాసే విద్యార్థులను జోన్‌-1, జోన్‌- 2 కింద విభజిస్తే 300 మంది విద్యార్థులకు ప్రయోజనం కలుగుతుందని పీఆర్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ముల్కిరెడ్డి మోహన్‌ రెడ్డి మంత్రికి వివరించారు. మున్సిపల్‌, గ్రామ పంచాయతీ కార్మికులను పర్మినెంట్‌ చేస్తూ కనీస వేతనంతోపాటు ప్రమాదబీమా, ఈపీఎఫ్‌, ఈఎస్‌ఐ, వారాంతపు సెలవులు తదితర సౌకర్యాలు కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ కన్వీనర్‌ పచ్చిమట్ల రవీందర్‌ గౌడ్‌ మంత్రికి వినతిపత్రం ఇచ్చారు.

ప్రజలకు రెడ్‌ కార్పెట్‌తో స్వాగతం

అవినీతికి తావులేకుండా ఏ సమస్య వచ్చినా నేరుగా నన్ను కలిసేందుకు ప్రజలకు రెడ్‌ కార్పెట్‌తో నా కార్యాలయానికి స్వాగతం పలుకుతున్నానని మంత్రి పొన్నం ప్రభాకర్‌ అన్నారు. హుస్నాబాద్‌ పట్టణంలో మంగళవారం ఉదయం పలు వార్డుల్లో మార్నింగ్‌ వాక్‌ చేస్తూ ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. హుస్నాబాద్‌ పట్టణంలో నెలకొన్న సమస్యలు నా దృష్టికి వచ్చాయని తెలిపారు. సమస్యలపై జాబితాను తయారు చేసి అధికారులతో పరిష్కరిస్తానని అన్నారు. అవసరమైతే నిధులు సేకరిస్తామన్నారు. ఆయన వెంట మున్సిపల్‌ కమిషనర్‌ రాజశేఖర్‌, ఇతర కాంగ్రెస్‌ నాయకులు ఉన్నారు.

అవినీతి సొమ్ముపై విచారణ చేపట్టాలి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్‌
- మెదక్‌లో రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మ దహనం

హవేళీఘనాపూర్‌(మెదక్‌): ఏఐసీసీ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ రాహుల్‌గాంధీకి అత్యంత సన్నిహితుడైన ధీరజ్‌ సాహు వద్ద లభించిన అవినీతి సొమ్ము రూ.350 కోట్లపై విచారణ చేపట్టాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్‌ డిమాండ్‌ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రమైన మెదక్‌లో రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా గడ్డం శ్రీనివాస్‌ మాట్లాడుతూ.. రాహుల్‌ గాంధీకి అత్యంత సన్నిహితుడైన ధీరజ్‌ సాహు ఎంపీగా ఓడిపోయినప్పటికీ రెండుసార్లు రాజ్యసభ నుంచి ప్రాతినిధ్యం అవకాశం కల్పించినటువంటి రాహుల్‌ గాంధీ సన్నిహితుడి వద్ద, డబ్బు, నగలు అవినీతి సొమ్ము కాదా.? అని వారు ప్రశ్నించారు. పెట్రోల్‌ ధర పెరిగింది అని చెప్పి సైకిల్‌ మీద వెళ్లినటువంటి ధీరజ్‌ సాహు మరి ఇంత డబ్బు ఎక్కడి నుంచి వచ్చిందని ప్రశ్నించారు. దీనిపై రాహుల్‌గాంధీ వివరణ ఇవ్వాలని డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో నల్లాల విజయ్‌, రఘువీరా రెడ్డి, ఎక్కలదేవి మధుసూదన్‌, గోడ రాజేందర్‌ యాదవ్‌, రమణ రావు, శ్రీనివాస్‌, తీగల శ్రీనివాస్‌, ప్రసాద్‌ ప్రభాకర్‌, శంకర్‌ గౌడ్‌,దయానంద్‌ రెడ్డి, సంతోష్‌ చారి, రంజిత్‌ రెడ్డి, రాజు, కల్కి నాగరాజు, రాహుల్‌, సన్నీ, బంటి తదితరులు పాల్గొన్నారు.



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

విద్యుదాఘాతంతో రైతు మృతి

పాపన్నపేట(మెదక్‌): విద్యుదాఘాతంతో రైతు మృతి చెందిన ఘటన మండల పరిధిలోని కొత్తపల్లిలో మంగళవారం ఉదయం చోటు చేసుకుంది. బాధితులు, పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన గౌరిగారి అనంతరాములు గౌడ్‌(62) పొలం పనులకు వెళ్లి సాయంత్రమైనా తిరిగి రాలేదు. కొడుకు సతీష్‌ గౌడ్‌ ఫోన్‌ చేసినా సమాధానం రాకపోవడంతో తిరుపతి అనే వ్యక్తిని అక్కడకు పంపాడు. పొలం వద్ద వెళ్లి చూసేసరికి ట్రాన్స్‌ఫార్మర్‌ పక్కన తీవ్ర గాయాలతో మృతి చెంది ఉన్నాడు. అతడికి భార్య యాదమ్మ, ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. కొత్తపల్లి రైతు సేవా సహకార సంఘం డైర్లర్‌ రమేశ్‌, కాంగ్రెస్‌ నాయకులు సందీప్‌ మృతుడి కుటుంబాన్ని పరామర్శించి సంతాపం వ్యక్తం చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు పాపన్నపేట ఏఎస్‌ఐ గాలయ్య తెలిపారు.



అనంతరాములు (ఫైల్‌)

అందరికీ విద్యే లక్ష్యంగా..

- కొనసాగుతున్న బడి బయట పిల్లల గుర్తింపు సర్వే
- జనవరి 10 వరకు నిర్వహణ
- జిల్లాలో 68 క్లస్టర్‌ల ఎంపిక
- గతేడాది 212 మంది పిల్లలు గుర్తింపు
- పాల్గొననున్న సీఆర్‌పీలు, ఐఈఆర్‌పీలు

ప్రశాంత్‌నగర్‌(సిద్దిపేట): విద్యాహక్కు చట్టం ప్రకారం బడీడు పిల్లలందరూ (14 ఏళ్లలోపు) కచ్చితంగా పాఠశాలలో చదువుకోవాలి. కానీ వివిధ కారణాల వల్ల అనేక మంది పిల్లలు చదువుకు దూరం అవుతున్నారు. ఇలాంటి వారిని గుర్తించడానికి ప్రభుత్వాలు బడీడు పిల్లల గుర్తింపు సర్వే కార్యక్రమం చేపట్టారు. ప్రస్తుతం సర్వే జిల్లాలో వేగంగా కొనసాగుతుండగా, జనవరి 10 వరకు చేపట్టనున్నారు. ప్రతీ హ్యాబిటేషన్‌లో బడి బయట ఉన్నటువంటి పిల్లల వివరాలను నమోదు చేసి, వారిని తిరిగి బడికి వచ్చేలా చేసే సదుద్దేశంతో ఈ కార్యక్రమాన్ని విద్యాశాఖ అధికారులు నిర్వహిస్తున్నారు.

సిద్దిపేట జిల్లాకు ఇతర జిల్లాలు, ఇతర రాష్ట్రాల నుంచి వలస వచ్చిన కుటుంబాలకు చెందిన చిన్నారుల వివరాలను నమోదు చేస్తున్నారు. జిల్లాలో ముఖ్యంగా భవన నిర్మాణాలు, పౌల్ట్రీ రంగం, ఇటుకబట్టీలు, తదితర పనులకు ఒరిస్సా, బీహార్‌, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్‌, మధ్యప్రదేశ్‌, ఛత్తీస్‌గఢ్‌ తదితర రాష్ట్రాల నుంచి వలస కార్మికులు వస్తుంటారు. దీంతో వీరికి చెందిన చిన్నారులు సమీపంలో పాఠశాలలు లేకపోవడంతో పాటుగా, తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోకపోవడంతో చదువుకు దూరం అవుతున్నారు. ఇలాంటి చిన్నారులను గుర్తించి పాఠశాలల్లో విద్యాబోధన అందించాలని ఈ బడీడు పిల్లల గుర్తింపు సర్వే కార్యక్రమం నిర్వహిస్తున్నారు.



బడీడు పిల్లలను గుర్తిస్తున్న సీఆర్పీలు

300 మంది ఉన్నట్లు అంచనా..

2022-23 విద్యాసంవత్సరంలో జిల్లాలో 212 మంది విద్యార్థులను గుర్తించి సమీపంలోని పాఠశాలల్లో చేర్చారు. మిగిలిన విద్యార్థులను 21 వర్క్‌ సైట్‌ స్కూళ్లను ప్రారంభించి, విద్యాశాఖ అధికారులు విద్యను అందించారు. 2023-24 ఏడాదికి గాను జిల్లాలో 68 హ్యాబిటేషన్‌ క్లస్టర్‌లను విద్యాశాఖ గుర్తించింది. ఈ క్లస్టర్‌ల పరిధిలో 104 మంది సీఆర్పీలు, 70 మంది ఐఈఆర్పీలు బడీడు చిన్నారులను గుర్తిస్తున్నారు. జిల్లాలో దాదాపుగా 300 పైగా బడీడు పిల్లలు బయట ఉన్నట్లు విద్యాశాఖ అధికారులు అంచనా వేశారు. వీరికి సమీపంలోని పాఠశాలల్లో అడ్మిషన్లు ఇస్తున్నారు. వీరితో పాటుగా జిల్లాకు చెంది మధ్యలో విద్యాభ్యాసం మానేసిన బాలకార్మికులను గుర్తించి, పాఠశాలల్లో చేర్పిస్తున్నారు.

చదువుకు దూరం కావొద్దు




బడీడు చిన్నారులు పాఠశాలల్లో విద్యను అభ్యసించాలి. కొన్ని ప్రత్యేక కారణాలతో చిన్నారులు తల్లిదండ్రులు పని చేసే ప్రదేశాల్లో ఉంటు, చదువులకు దూరం అవుతున్నారు. ఇలాంటి చిన్నారులను గుర్తించేందుకు బడీడు పిల్లల గుర్తింపు సర్వే నిర్వహిస్తున్నాం. గుర్తించిన చిన్నారులకు సమీపంలోని పాఠశాలలో విద్యను అందించడమే లక్ష్యంగా పెట్టుకున్నాం. ఎవరూ చదువుకు దూరం కావొద్దు.

–శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి


గుండెపోటు కలవరపాటు

- చిన్నా, పెద్దా తేడా లేకుండా బారిన
- ఒత్తిడి, ఆందోళనతో సమస్యలు అధికం
- ప్రజల్లో మారుతున్న జీవనశైలి
- ఆహార నియమాలు, వ్యాయామంపై నిర్లక్ష్యం
- జాగ్రత్తలు పాటించాలంటున్న వైద్యులు



గుండె మన శరీరంలో అత్యంత ముఖ్యమైన అవయవం. ఇది శరీరంలో ఛాతీ, ఊపిరితిత్తుల మధ్య ఉంటుంది. గుండె ఆక్సిజన్‌, పోషకాలని రక్తం ద్వారా శరీరంలోని అన్ని భాగాలకి సరఫరా చేస్తుంది. అయితే మారిన జీవనశైలి, ఆహార అలవాట్ల వల్ల ప్రస్తుతం వయస్సు, లింగ భేదంతో సంబంధం లేకుండా చాలా మందిలో గుండె సంబంధిత సమస్యలు ఎక్కువ అవుతున్నాయి. ప్రతిరోజూ వ్యాయామం చేస్తూ ఆరోగ్యంగా ఉన్న యువతలో కూడా అకస్మాత్తుగా గుండెపోటు రావడం ఇప్పుడు ఆందోళన కలిగిస్తున్న విషయం. ఇప్పుడున్న పరిస్థితుల్లో గుండెపోటు మన దరి చేరకుండా ఉండాలంటే పలు రకాల జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

– సంగారెడ్డి టౌన్‌



జిల్లాలో గుండెపోటు కేసులు కలవరపరుస్తున్నాయి. 50 ఏళ్లలోపు గుండెపోటుకు గురవుతున్న వారి సంఖ్య గణనీయంగా పెరుగుతున్న తీరు విస్మయపరుస్తోంది. ఓ వైపు టెక్నాలజీ పెరుగుతోంది.. వైద్యరంగం కొత్త పుంతలు తొక్కుతోంది. మరోవైపు.. మనిషి ఆరోగ్యం మాత్రం అవసవ్య దిశలో పరుగెడుతోంది. ఒకప్పుడు 60 పైబడిన వారిలో మాత్రమే గుండె సమస్యలు కనిపించేవి. నేడు 40 ఏళ్లలోపు వారినీ గుండెపోటు మింగేస్తోంది. గుండెకు శత్రువులు.. రక్తపోటు, మధుమేహం. కానీ, ఇటీవలి కాలంలో ఈ రెండు సమస్యలూ లేకపోయినా చాలామంది గుండెపోటు బారినపడుతున్నారు. దీనికి ప్రధాన కారణం మారుతున్న జీవన శైలి, ఆహారపు అలవాట్లు, శారీరక శ్రమ లోపించడం, వ్యాయామం లేకపోవడం అంటున్నారు నిపుణులు.

ఆహారపు అలవాట్లు..

రోజూ తినే ఆహారపు అలవాటు భయాందోళనకు గురిచేస్తోంది. జీవనశైలిలో వస్తున్న మార్పులు, వ్యాయామం లేకపోవడం వంటి ప్రధాన కారణాలతో వస్తున్న గుండె జబ్బులు కుటుంబాలను విషాదంలోకి నెడుతున్నాయి. ఏటా ఐదు వేల నుంచి ఆరు వేల మంది వరకు గుండెపోటుకు గురవుతున్నారు.

వ్యాయామం చేయకపోవడం..

యువకుల్లో పూర్తిగా నడక తగ్గిపోయింది. కిలోమీటర్‌ వెళ్లాలన్నా బైక్‌లపై వెళ్తున్నారు. ఇష్టారాజ్యంగా కొవ్వుతో కూడిన ఆహారం తినడం, వ్యాయామం చేయకపోవడం వల్ల 30 ఏళ్లకే హార్ట్‌ స్ట్రోక్‌ వస్తోంది. శరీరానికి వ్యాయామం మినహా గుండెపోటు నియంత్రణకు మరో మార్గం ఏమీ లేదు. ఆల్కహాల్‌, సిగరెట్లు అలవాటు ఉంటే మానేయాలి.

గుండెపోటుకు ప్రధాన కారణాలు

- రక్తపోటు నియంత్రణలో లేకపోవడం.. రక్తపోటు ఉందని తెలుసుకోలేకపోవడం.
- కొవ్వు పేరుకుపోయి గుండెకు వెళ్లే రక్తనాళాలను పూడ్చివేయడం
- ఒబేసిటీ అంటే వయస్సు, ఎత్తుకు తగిన దానికంటే బరువు ఎక్కువగా ఉండడం.
- ఎక్కువ నూనెలు, కొవ్వులతో కూడిన ఆహారాన్ని తీసుకోవడం.
- తీవ్ర మానసిక ఒత్తిడి, ఆందోళనకు గురికావడం
- ఆరోగ్యంపై జాగ్రత్తలు పాటించకపోవడం, నిత్యం వ్యాయామం చేయకపోవడం.

జాగ్రత్తలు ఇలా..

- రోజూ క్రమం తప్పకుండా 45 నిమిషాలు వ్యాయామం చేయాలి.
- 35 ఏళ్లు వచ్చాక మధుమేహం, బీపీ వంటి పరీక్షలు తరచూ చేయించడం.
- ఆరుమాసాలకు ఒకసారి విధిగా ఈసీజీ పరీక్షలు చేయించుకోవాలి.
- ఆకుకూరలు, కూరగాయలతో కూడిన ఆహారం తీసుకోవాలి.
- షుగర్‌, బీపీ ఉన్న వాళ్లు మందులతో వాటిని అదుపులో ఉంచుకోవడం
- శరీరంలో కొవ్వు, నూనె మోతాదుకు మించి ఉంటే అదుపులో ఉంచుకోవాలి.

ఒత్తిడితో సమస్యలు..



కొందరు ఉద్యోగ పరంగా లేదా వైవాహిక పరంగా విపరీత ఒత్తిడికి లోనవుతున్నారు. కొవ్వు సాధారణ స్థాయిలో ఉండి, సన్నగా ఉన్నవారికి కూడా ఒత్తిడితో గుండెపోటు వస్తోంది. పరస్పర అంగీకారంతో కుటుంబాల్లో సమస్యలను పరిష్కరించుకోవాలి. ఒత్తిడి తగ్గించుకొని గుండెపోటును దూరం చేసుకోవచ్చు. బయట ఆహారాన్ని తగ్గించాలి.

– డాక్టర్‌ మహేశ్‌, వైద్య నిపుణుడు

సైబర్‌ నేరగాళ్ల వలలో మహిళలు

- ఇద్దరి నుంచి రూ.2.22 లక్షలు వసూలు
- మోసపోవడంతో పోలీసులను ఆశ్రయం

పటాన్‌చెరుటౌన్‌: సైబర్‌ వలలో ఓ యువతి రూ. 1.92 లక్షలు, గృహిణి రూ.30 వేలు పోగొట్టుకున్న ఘటనలు అమీన్‌పూర్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకున్నాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అమీన్‌పూర్‌ పరిధిలోని బీరంగూడకు చెందిన ఓ యువతికి నవంబర్‌ 11వ తేదీన పార్ట్‌ టైం జాబ్‌ అంటూ మెసేజ్‌ వచ్చింది. బాధితురాలు తన వివరాలను నమోదు చేసి పలు దఫాలుగా రూ.1.92 లక్షలు పంపించింది. తీరా పెట్టిన నగదుపాటు కమీషన్‌ ఇవ్వాలని అడగడంతో అపరిచిత వ్యక్తి స్పందించలేదు. బాధితురాలు తాను మోసపోయినట్లు గుర్తించి ముందుగా సైబర్‌ క్రైమ్‌లో, మంగళవారం అమీన్‌పూర్‌ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

గృహిణి వద్ద రూ.30వేలు

అమీన్‌పూర్‌ పరిధిలోని ఓడీఎఫ్‌ కాలనీకి చెందిన ఓ గృహిణికి వర్క్‌ ఫ్రం హోం జాబ్‌ ఉందంటూ నవంబర్‌ 24వ తేదీన ఫోన్‌కు మెసేజ్‌ వచ్చింది. ఆమె అపరిచిత వ్యక్తి చెప్పినట్లుగా వివరాలు నమోదు చేసి రూ.30వేలు పెట్టుబడి పెడితే కమీషన్‌ వస్తుందని చెప్పడంతో అలాగే చేసింది. కొద్దిరోజులకు నగదుతోపాటు కమీషన్‌ ఇవ్వాలని అడిగితే అతడు స్పందించలేదు. దీంతో బాధితురాలు తాను మోసపోయినట్లు అమీన్‌పూర్‌ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.